క్లుప్తంగా

పోలేరమ్మ జాతర ప్రారంభం

కపిలేశ్వరపురం: అంగరలోని పోలేరమ్మ జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద ఏకాహం నిర్వహించారు. గురువారం జాతర, 3న తీర్థం నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: విద్యార్థి దశలో సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీస్ మహ్మద్ షైనాజ్ అన్నారు. కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంక ఎంపీపీ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించే దిశగా షైనాజ్ అవగాహన కల్పించారు. లైంగిక సమస్యలను గుర్తించేందుకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశంపైనా, ప్రమాదాల నిరవారణ కోసం రహదారిపై ప్రయాణాల నియమ నిబంధనలపైనా, మంచి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన పోషక విలువల గల ఆహార పద్ధతులపై విద్యార్థులకు షైనాజ్ అవగాహన కల్పించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో కొలువైన వర సిద్ధి వినాయకుడు

కె.గంగవరం: అముజూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయం వద్ద వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు చేస్తున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎంపీపీ పంపన నాగమణి, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాలు, డీసీయంస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, పలు గ్రామాలు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా వారోత్సవాలు



క్రీడా వారోత్సవాలను ప్రారంభిస్తున్న జీవీ రావు

రామచంద్రపురం: పట్టణంలోని మోడరన్ విద్యా సంస్థల్లో క్రీడా వారోత్సవాలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. విద్యా సంస్థల అధినేత జీవీరావు జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీరావు మాట్లాడుతూ విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా క్రీడా స్ఫూర్తిని నింపేందుకుఏటా మోడరన్ హైస్కూల్‌లోక్రీడా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల పీ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ఎం చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

మండపేట: పట్టణంలోని సత్యసాయిబాబా వారి సన్నిధిలో కొలువైన మహాగణాధిపతి, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్ల ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ వి.సాయికుమార్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు ఖండవిల్లి విజయసారథి, సంపర సాయిప్రసాద్ పర్యవేక్షణలో రాత్రి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా గురువారం స్వామివార్లకు పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్టు సాయిప్రసాద్ తెలిపారు. వంక సత్యవతమ్మ, వేగుళ్ల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అరాచక పాలనకు కాంగ్రెస్‌తోనే అడ్డుకట్ట

మండపేట: రాజ్యాంగ హక్కులను కాలరాసి బీజేపీ సాగిస్తున్న అరాచక పాలనకు అడ్డుకట్ట వేయడం, దేశాభివృద్ధి లక్ష్యంగా 85వ ఏఐసీసీ ప్లీనరీ జరిగిందని డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తెలిపారు. గత నెల 24, 25, 26 తేదీల్లో రాయపూర్‌లో జరిగిన ప్లీనరీకి హాజరై వచ్చిన కామన బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. యువకు ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయం, అనుబంధాల రంగాల అభివృద్ధి తదితర ఆరు అంశాలపై ప్లీనరీలో తీర్మానించామన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాజీలేని పోరాటం చేయాలని పార్టీ నిర్ణయించిందని కామన తెలిపారు.

పేదల ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యం

- సత్ఫలితాలు ఇస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్
- రెండు నియోజకవర్గాల్లోని 15 పీహెచ్‌సీల పరిధిలో సేవలు
- 117 గ్రామాల ప్రజలకు మేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న వృద్ధులు, వికలాంగులు



కపిలేశ్వరపురంలో వృద్ధుడి ఇంటికెళ్లి వైద్యసేవలందిస్తున్న డాక్టర్ అనూజ ప్రియాంక

కపిలేశ్వరపురం: సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే విద్య, వైద్య సేవలు ప్రజల చెంతకు సక్రమంగా చేరాలి. అదే జరుగుతోంది ఇపుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో. మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రలో విద్య, వైద్య రంగాల్లో సామాన్యులకు విశేష సేవలందుతున్నాయి. వైద్య రంగంలో అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

ఇంటివద్దకే ప్రభుత్వ వైద్యం...

అనారోగ్యంతో అవస్థ పడుతున్న రోగి ఇంటి వద్దకే నాణ్యమైన ప్రభుత్వ వైద్యాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తుంది. ఈ విధానం గతేడాది చివరలో ప్రారంభమైంది. క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 15 పీహెచ్‌సీల ద్వారా రోగులకు సేవలందుతున్నాయి. శేరిలంక పీహెచ్‌సీ పరిధిలో ఒకే ఒక్క గ్రామం ఉండడం, అక్కడ పీహెచ్‌సీ సేవలందుతుండడంతో కాన్సెప్ట్ నుంచి మినహాయించారు. మిగిలిన 15 పీహెచ్‌సీల్లోని 117 గ్రామాలకు వైద్యులు, సిబ్బంది రోగుల ఇంటికి వెళ్లి వైద్యం చేస్తున్నారు. 104, పీహెచ్‌సీల వైద్యులు, అధికారులు, ఉద్యోగులు, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలందరూ సేవా దృక్పథంతో క్షేత్రస్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నెలలో రెండు రోజులు 104 వాహనంలో వైద్య సిబ్బంది గ్రామానికి వెళ్లి సేవలందిస్తారు. బీపీ, షుగరు, టీబీ తదితర 14 రకాల పరీక్షలు చేసే సాంకేతికతతో 104 వాహనాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఆధునీకరించింది. 67 రకాల అవసరమైన రోగులకు ఉచితంగా అందించేందుకు 67 రకాల మందులను సిద్ధం చేశారు.

పరీక్ష నివేదికల ఆధారంగా ఇంటి వద్దనే వైద్యుడు రోగికి తన ఆరోగ్య పరిస్థితిని వివరించి ధైర్యం చెబుతున్నారు. మందులను ఉచితంగా అందజేసి, పాటించాల్సిన నియమాలు వివరిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించడం వల్ల ఈ కాన్సెప్ట్ విజయవంతానికి దోహదపడుతుంది. గ్రామంలో వైద్యం చేసేందుకు ఒక వైద్యుడు వెళ్ళినా మరో వైద్యుడు ఆసుపత్రిలో వైద్యం చేసేందుకు సాధ్యపడుతుంది.

రెండు నియోజకవర్గాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలిలా...

పీహెచ్‌సీ	జనాభా	గ్రామాలు
అంగర	20,175	04
వాకతిప్ప	16,216	05
అచ్యుతాపురం	17,109	08
ద్వారపూడి	44,904	06
కేశవరం	22,784	06
రాయవరం	26,390	06
మాచవరం	19,000	06
గొల్లపాలెం	29,572	15
దుగ్గుదూరు	29,843	08
ద్రాక్షారామ	32,000	11
వెల్ల	23,452	14
పామర్రు	21,300	09
దంగేరు	16,236	07
పేకేరు	17,130	06
కుందూరు	20,252	06
మొత్తం	3,85,935	117

ఆత్మీయంగా పరీక్షిస్తున్నారు



వయస్సు పైబడడంతో బయటకు వెళ్ళడం కాస్త ఇబ్బందికరంగా ఉంది. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రభుత్వ వైద్యురాలు ఇంటికే వచ్చి పరీక్షించి ఉచితంగా మందులిస్తున్నారు. ఇలాంటి వైద్య సేవల తీరు గతంలో ఎప్పుడూ చూడలేదు. ఈ కాన్సెప్ట్ నాలాంటి ఎందరికో ఉపయోగకరంగా ఉంటుంది.

–పలివెల అబ్రహం, కపిలేశ్వరపురం

మారుమూల గ్రామమైనా..



మారుమూల గ్రామమైన తాతపూడిలోని మా అత్తమ్మ సీతాకుమారిని డాక్టరు గారు ఇంటికొచ్చి పరీక్షిస్తున్నారు. తాతపూడి గ్రామం నుంచి అంగర పీహెచ్‌సీకి వెళ్ళేందుకు ప్రయాణ సాధనాలు తక్కువ. ప్రయాసపడి ఆసుపత్రి వరకూ వెళ్ళనక్కర్లేకుండా ఇంటికే వచ్చి వైద్య సేవలందించడం ఎంతో సౌకర్యంగా ఉంది.

– జిత్తుక సరిత, తాతపూడి, కపిలేశ్వరపురం మండలం

మనస్సుకు సంతృప్తి ఇస్తుంది



ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రభుత్వ రంగంలో వైద్యురాలిగా నాకు మానసికంగా సంతృప్తి ఇస్తోంది. గ్రామీణ ప్రాంతంలో సామాన్య కుటుంబం వద్దకు వెళ్ళి రోగిని పరీక్షిస్తున్నప్పుడు పేదలకు సేవ చేస్తున్నానన్న భావన కలుగుతుంది.

–డాక్టర్ కరుణేంద్రకుమారి, అచ్యుతాపురం పీహెచ్‌సీ

సత్ఫలితాలు ఇస్తోంది



ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ మంచి ఫలితాలను ఇస్తోంది. మారుమూల గ్రామానికి సైతం వెళ్ళి రోగులను పరీక్షించి మందులు ఇవ్వడం పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో ఉపకరిస్తోంది. వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు అవస్థలు తప్పాయి. పీహెచ్‌సీ, 104 వాహన సిబ్బంది సహకారంతో సేవలందించడం సాధ్యమవుతుంది.

–డాక్టర్ రత్నకుమారి, వైద్యాధికారి అంగర పీహెచ్‌సీ

పశువులకు టీకాలు



ద్రాక్షారామలో పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్న ఏడీ రామకృష్ణ, పశు వైద్యాధికారి కృష్ణార్జున

రామచంద్రపురం రూరల్: గాలికుంటు వ్యాధి నివారణ బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ పశువులకు టీకాలు వేస్తున్నట్టు నుంచి ఏడీ ఒ.రామకృష్ణ తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున ఆధ్వర్యంలో 120 పశువులకు వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు మేడిశెట్టి శ్రీనివాస్, రాయుడు వెంకట్రావు, సహాయకుకు ధనరాజు, పశు వైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

కె.గంగవరం: యండగండి గ్రామంలో బుధవారం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ పశువులకు టీకాలు వేశారు. పామర్రు పశువైద్యశాల ఆధ్వర్యంలో ఈ టీకాల కార్యక్రమాన్ని రామచంద్రపురం ఏడీ రామకృష్ణ ప్రారంభించారు. గ్రామంలో 80 శాతం పశువులకు టీకాలు వేసినట్టు తెలిపారు. పశువైద్యురాలు ఎం.బిందు, పశుసంవర్ధన శాఖ సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగస్త్యేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

మండపేట: పట్టణంలోని రథం గుడిలో కొలువైన అగస్త్యేశ్వర కైలాసేశ్వర, సర్వేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమై, వారం రోజుల పాటు జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం స్వామివార్ల దివ్య కల్యాణం జరుగుతుందన్నారు. 8వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని బుధవారం ఆలయ అధికారులు ఒక ప్రకటనలో కోరారు.

పింఛన్ అందగా.. ఆనందం నిండగా



రాయవరంలో తాడి వెంకటలక్ష్మికి దివ్యాంగ పింఛను అందిస్తున్న వలంటీర్ కనకజ్యోతి



ఉదయం ఐదింటికే లబ్ధిదారుడు నిమ్మకాయల బాబ్జీకి పింఛను అందిస్తున్న వలంటీర్ షేక్ సుభాన్‌బీ



మంచానికి పరిమితమైన బైలపూడి ఎల్లాయ్యమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ పైడివాడ బాలఅనిల్

క్లస్టర్ పరిధిలో 80 శాతం పింఛన్ల పంపిణీ

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా పింఛన్ల పండగ నిర్వహిస్తోంది. ఉదయం ఐదు గంటల నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ పింఛను కానుకను అందించారు.అధికారుల పర్యవేక్షణలో బుధవారం వేకువజాము నుంచే పింఛన్లు పంపిణీ చేశారు. ఒకటో తేదీనే ఠంఛన్‌గా పింఛన్లను అందివ్వడంతో ముదిమి మోముల్లో ఆనందం తొణికిసలాడింది. కేవలం పింఛను మీదే ఆధారపడి జీవితాన్ని వెళ్లదీస్తున్న లబ్ధిదారుల్లో ఆత్మస్థైర్యాన్ని ఇవ్వడమే కాకుండా వారి జీవితాలకు భరోసా కల్పిస్తోంది.

క్లస్టర్ పరిధిలో.

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట రూరల్, మండపేట అర్బన్, కపిలేశ్వరపురం, రామచంద్రపురం అర్బన్, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం మండలాల పరిధిలో మార్చిలో 63,354 మందికి సామాజిక పింఛన్లుగా రూ.17,23,91,500 పంపిణీ చేయాలి. బుధవారం సాయంత్రం 4.45 గంటలకు 50,453 మందికి రూ.13,72,56,203 మేర పంపిణీ చేశారు. క్లస్టర్ పరిధిలో 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. క్లస్టర్‌లో పింఛన్ల పంపిణీలో రాయవరం మండలం 86 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది.

రాజుగారి కోటలో సినిమా షూటింగ్



రాజుగారికోటలో ప్రారంభమైన సందిగ్ధం చిత్రం షూటింగ్

రామచంద్రపురం: తీర్థ క్రియేషన్స్ వారి సందిగ్ధం చిత్రం షూటింగ్ బుధవారం రాజుగారి కోటలో ప్రారంభమైంది. ఈ చిత్రానికి మున్సిపల్ చైర్మన్ గాధంశెట్టి శ్రీదేవి క్లాప్ కొట్టగా, ప్రముఖ వైద్యులు డాక్టర్ చెలికాని స్టాలిన్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ చిత్ర దర్శక, నిర్మాత పార్థసారథి కొమ్మోజు మాట్లాడుతూ నూతన హీరోలు నిహాల్, అర్జున్ దేవ్‌లు హీరోయిన్‌లుగా కాజోల్ తివారీ, సునిధి చౌహాన్ నటిస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక పాత్రలో సంపూర్ణేష్ బాబు నటిస్తుండగా జీవా మరో పాత్ర చేస్తున్నట్టు చెప్పారు. వీరితో పాటుగా జబర్దస్త్ నటులు అప్పారావు, రైజింగ్‌రాజు, చిట్టిబాబు, గెడ్డం నవీన్, ఆనందభారతి ఈ చిత్రంలో నటిస్తున్నట్టు చెప్పారు. రాజుగారి కోటలో పది రోజుల పాటు ఈ సినిమా షూటింగ్ జరుగుతుందని తెలిపారు. పట్టణ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ తోట అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

యశోదమ్మకు తుది వీడ్కోలు



యశోదమ్మ భౌతిక కాయాన్ని సమాధి చేస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: ఆదివారపుపేట శివబాలయోగి మహరాజ్ ఆశ్రమ నిర్వాహకురాలు యశోదమ్మ సోమవారం మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు బుధవారం ఆశ్రమంలో నిర్వహించారు. గ్రామస్తులతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి, బెంగళూరు, శ్రీలంక, మలేషియా తదితర చోట్ల నుంచి తరలివచ్చిన బాలయోగీశ్వరుల శిష్యులు, కుటుంబ సభ్యులు, భక్తులు బుధవారం శోకతప్త హృదయాలతో తుది వీడ్కోలు పలికారు. తన యావత్ జీవితం బాలయోగీశ్వరుల సేవలోనే గడిపిన యశోదమ్మకు బాలయోగీశ్వరుల సమాధి సమీపంలోనే సమాధి చేశారు. రెండు రోజుల పాటు భక్తుల సందర్శనార్థం ఆమె పార్థివ దేహాన్ని ఆశ్రమ ప్రాంగణంలో ఉంచారు. భారీ ఊరేగింపుతో అంతిమ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కిన దొరబాబు, ఎంపీటీసీ బళ్ల సుధాకరరావు, చేనేత సహకార సంఘం చైర్మన్ ఉప్పు అర్ధనారీశ్వర బులిరాజు, ఆధ్యాత్మిక గురువు కలకండ రామలింగేశ్వరరావు, రాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, శివబాలయోగి ట్రస్ట్ చైర్మన్ వట్టికూటి వీరవెంకట సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ కొమ్మిరెడ్డి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: పశువులకు వేసే గాలి కుంటు వ్యాధి టీకాలు వేయించి, ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. రాయవరం పశువుల ఆస్పత్రి వద్ద బుధవారం గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఎంపీపీ వెంకటరమణ సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. నాలుగు నెలల వయస్సు పైబడిన ప్రతి పశువుకూ గాలి కుంటు వ్యాధి టీకాలు తప్పనిసరి అని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ అనిత పాడిసూచించారు. మండపేట, రాయవరం మండలాల పరిధిలో తొలి రోజు 400కు పైగా పాడి పశువులకు ఉచితంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు.

శివారు భూములకు సాగునీరందించాలి

కాజులూరు: మండల గ్రామాల్లో కాలువ శివారు భూములకు సాగునీరందేలా నీటి పారుదల శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. బుధవారం బాధిత రైతులు పోలినాటి నగేష్, కొప్పల వెంకన్న, దడాల అప్పారావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ఆర్యావటం శివారు తుమ్మలపల్లిలంకలో ఉన్న పొలాలకు సాగునీరు సక్రమంగా అందటం లేదన్నారు. తమ పొలాలకు పెదపూడి మండలం చితంపల్లి లాకుల నుంచి సాగునీరు రావల్సి ఉందన్నారు. అయితే ఎగువ ప్రాంతంలోని పెదపూడి, కరప మండల గ్రామాల రైతులు నిబంధనలకు విరుద్ధంగా పంట కాలువలో ఆయిల్ ఇంజిన్లు వేసి నీరుతోడుకుంటున్నారని, దీనివల్ల శివారు భూములకు సాగునీరందటంలేదన్నారు. వరి పంట దుబ్బు కట్టే దశ, చిరుపొట్ట దశలో ఉన్నాయన్నారు. ఈ దశలో నీరు ఎక్కువ అవసరమవుతాయని తెలిపారు. అధికారులు స్పందించి కాలువ శివారు భూములకు సక్రమంగా పూర్తి స్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విజేతలకు అభినందనలు

రాయవరం: గత నెల 22 నుంచి 28 వరకూ మండపేట మండలం ఇప్పనపాడు గ్రామంలో నిర్వహించిన నవీన్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కూర్మాపురం టీమ్ విజేతగా నిలిచింది. ఆ జట్టు ఫైనల్స్‌లో ఇప్పనపాడు జట్టుపై 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. విన్నర్స్ టీమ్ కెప్టెన్ ఆశిష్‌ను, టీమ్ సభ్యులను కూర్మాపురం పంచాయతీ ఉప సర్పంచ్ ఈతకోట లక్ష్మణరావు, వార్డు సభ్యుడు చౌటుపల్లి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత నీతిపూడి మధుబాబు, గ్రామస్తులు బుధవారం అభినందించారు.

చేసిన మేలును ప్రజలకు వివరించండి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- గృహ సారథులతో సమావేశం



అంగరలో గృహ సారథులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: పారదర్శకంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రజా ప్రభుత్వానికి బాసటగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గృహ సారథులకు సూచించారు. అంగరలోని వీరవెంకట సత్యనారాయణ కల్యాణ మండపంలో బుధవారం గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. మా నమ్మకం నువ్వే జగన్ పేరుతో నిర్వహించిన సమావేశానికి మండలంలోని 19 గ్రామాలకు చెందిన గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు హాజరయ్యారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి , వైఎస్సార్ సీపీ మండల నాయకులు శీలం గోవింద్, నక్కా సింహాచలం తమ ప్రసంగాల్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు మధ్యవర్తులు లేని విధంగా పారదర్శకంగా ప్రభుత్వ లబ్ధిని నేరుగా అందజేస్తోందన్నారు. అందులో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు కీలకంగా పనిచేస్తుందన్నారు. ప్రజల సమస్యలపై పనిచేస్తున్నందుకే తాను అనేక సార్లు ఎమ్మెల్యేగా గెలవగలిగానన్నారు. నేడు వలంటీర్లకు ప్రజల్లో విశేష ఆదరణ ఉందని, ప్రజల ఆశీస్సులతో సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పలివెల మధు, పసలపూడి శ్రీనివాస్, వంగా శ్రీను, పాలింగి కిశోర్, 19 గ్రామాల్లోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం



వెల్లలో స్పందన అర్జీపై విచారిస్తున్న ఆర్డీఓ సింధూసుబ్రహ్మణ్యం

రామచంద్రపురం రూరల్: స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్టు రామచంద్రపురం ఆర్డీఓ పి.సింధూ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం వచ్చిన స్పందన అర్జీలపై ఆర్డీఓ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఉట్రుమిల్లిలో కె.వివేక్ ఇచ్చిన అర్జీలో పేర్కొన్న అక్రమంగా వేసిన షెడ్డును పరిశీలించారు. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా వెల్ల గ్రామంలో పి. వెంకట్రావు పెట్టిన అర్జీపై వివాదాస్పదంగా ఉన్న రహదారి స్థలాన్ని పరిశీలించారు. విచారించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీఓ వెంట ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, పంచాయతీ కార్యదర్శులు సుందర్‌లాల్, రాయుడు మోహన్, ద్రాక్షారామ ఎస్సై బి. వినోద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'పొలంబడి'ని సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: రైతులకు వ్యవసాయంపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి సూచించారు. కుందూరులో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాగమణి మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం పాటించడం వల్ల ఖర్చును అదుపులో ఉంచుకోవచ్చన్నారు. రబీలో రైతులు పొలాలకు వాడాల్సిన ఎరువులపై అవగాహన కల్పించారు. రామచంద్రపురం వ్యవసాయ సహాయకులు జయ రామలక్ష్మీ మాట్లాడుతూ భూమిలో గడ్డి, పెంట వంటి వ్యర్థ పదార్థాలను కుళ్లించడం ద్వారా సూక్ష్మజీవులు ఉద్భవించి మొక్కకు మేలు చేస్తామన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా ఎలుకల మందును పంపిణీ చేశారు. ఏట రవి, సర్పంచ్ సత్యానందం, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బత్తుల అప్పారావు, గ్రామపెద్దలు పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సింహ వాహనోత్సవం



యానాంలో సింహ వాహనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

యానాం: యానాంలో వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా 9వ రోజు బుధవారం సింహ వాహనోత్సవం అట్టహాసంగా జరిగింది. యానాం ఉపాధ్యాయ సంఘం ఉత్సవ దారులుగా నిర్వహించిన ఈ వేడుకలో నియోజక వర్గ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. తొలుత స్వామివారికి సంకల్పం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శారదా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల టీచర్లు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి, ఆంజనేయ స్వామికి నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం సింహ వాహనంపై స్వామివారిని అధిరోహింపజేసి పురవీధులలో ఊరేగించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఏ మునిస్వామి తదితరులు వాహనోత్సవాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, వినోదాచార్యులు, పెద్దింటి సాయిరామకృష్ణ పూజలు చేశారు.

కోదండ రాముని విగ్రహ ప్రతిష్ఠ

తాళ్లరేవు: తాళ్లరేవు శివారు శ్రీరంగనాయకపురంలోని కోదండ రామాలయంలో ఉదయం సీతా పరివార సమేత శ్రీరామచంద్రమూర్తి, గణపతి, సరస్వతీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం 8.30 గంటలకు ఏకశిలా ధ్వజ స్తంభాన్ని క్రేన్ సహాయంతో ప్రతిష్ఠించారు. తొలుత స్వామివారి దర్శనం గోవుకు చేయించి, అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేద పండితుడు వెంకటేశ్వర శర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణకర్త మంతెన భువనేశ్వరీవర్మ ఆధ్వర్యంలో ఐదుగురు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది. మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీపీ రాయుడు సునీత, కేశవస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను, నాయకులు రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: బండారులంక నారాయణరావుపేటలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహించారు.